

# కుక్కతోక

''కుక్కతోక తెచ్చి గొట్టంబు చేర్చిన, తిన్ననగును దాననున్నవరకె'' నాల్గవ క్లాసు చదువుతున్న గోపీ తన కొత్త పద్యం వల్లె వేస్తున్నాడు. బడి దగ్గరే. తెలుగు మీడియం. మొదటి తరగతినించే గోపీ క్లాసు ఫస్టు వస్తున్నాడు.

కాలింగ్ బెల్ వినబడి, కిచెన్ నుంచి వచ్చి, గొలుసు తీసి చూసి తలుపు పూర్తిగా తీసింది శాంత ''రండి'' అంటూ లోపలికి దారి తీసింది. వచ్చినామె నడివయస్కురాలు. ఆపదకొండంతస్తుల ఆకాశహర్మ్యంలో రెండవ అంతస్తులో నాల్గవ నంబరు అపార్ట్‌మెంటులో వుంటున్నది.

ఆ హర్మ్యం పేరు ''భైరవ్'' అపార్ట్‌మెంట్సు. దాన్ని లేవదీసినాయన భైరవమూర్తిగారు. సకుటుంబంగా కాశీ యాత్ర చేసి వచ్చి, కాశీ సమారాధన కాల భైరవారాధన చేసి, శంకు స్థాపన తంతు వైభవంగా జరిపి, విందు యిచ్చి బ్లౌజ్ పీసెస్ కొబ్బరి బోండాలు పచ్చివీ భార్య చేత పంచి పెట్టించి, భవనం మొదలుపెట్టిన వేళావిశేషం వల్ల సరీగ్గా మూడేళ్లలో పూర్తి అయింది. ఫ్లాట్సు బిరబిరా అమ్ముడు పోయాయి. లిఫ్ట్ వేయించాడు. లైట్లు వెలిగినై. కొళాయి శాంక్షనయింది. అమ్ముడుపోక మిగిలిన వాటిలోకి అద్దెకొచ్చారు వుద్యోగస్తులు. కార్లూ, స్కూటర్లూ నిలుపుకునే సౌకర్యమున్నది. వాచ్‌మన్ కుటుంబం వచ్చేశారు. భైరవమూర్తిగారూ, కాంట్రాక్టు వుద్యోగాలు చేసి, గల్ఫ్ దేశాలు వెళ్లి ఆర్జించిన ధనంతో కట్టాడా భవనాన్ని. ఫెన్సూ, ప్రహరీ, ఆటస్థలమూ అమిరి ఆకర్షించినై.

''నువ్వు నన్ను చూసే వుంటావు శాంతమ్మా. గిల్ట్ అక్షరాలతో నంబర్లతో, ఆక్రమించిన వారి పేర్లూ అపార్ట్‌మెంట సంఖ్య తెలిసేట్టు చేశారు యజమాని. మీ ఆయన నందకుమార్ శర్మకి మా ఆయన భైరవ మూర్తిగారు పరిచితులే. ఇంటికోసం వెతుకుతున్నారని తెలియగానే, సౌకర్యంగా వున్న అపార్ట్‌మెంటు శాంక్షన్ చేశారు. నేను సోషల్ వర్క్ చేస్తాను. ఒక్కడే కొడుకు. రెక్కలు రాగానే స్టేట్స్‌కి వెళ్లి, అక్కడే పెళ్లీ ముగించాడు. పేరు రామరాజు. కోడలు పాలా కాబోలు

డాక్టరే. కుటుంబీకుడయినాడనుకో శాంతా. నేను వెళ్లలేదు. యేమున్నది చూసేందుకు?'' అని వాగుతున్నది. కుర్చీ చూపగానే ఆసీనురాలైంది.

''టీ తీసుకో పిన్నీ. అట్లాంటా చూడచ్చు. నయగరా జలపాతం. అక్కడి ఆచార వ్యవహారాలూ చూడచ్చు. మీ అబ్బాయి రమ్మని రాయడూ? పోనీ తానే వచ్చి తీసికెళ్లడూ?'' ఆరు కావస్తున్నదని వంట కుపక్రమించింది.

'' ఇద్దరం వెళ్లాలి. మీ బాబాయికి అటువంటి వుత్సాహం వున్నట్లు నాకు తెలియరాలేదు. నేను ఒక్కత్తెనూ వెళ్లి రాలేను. అబ్బాయికి శలవు లేదుట. టీ చాలా బాగున్నది శాంతా'' బూందీలాగా వున్నవి తెల్లనివి తిన్నది. లేచి, కప్పు సాసరూ సింక్‌లో కడిగి బల్లమీద బోర్లించింది వరండావేపు వెళ్లింది. చల్లని సముద్రపు గాలి తాకింది. లోపలి కొచ్చి, యిల్లు యెలా సద్దుకున్నదీ, గోడల అలంకారాలు చూసి సంతోషించింది. పద్యం వల్లిస్తున్న గోపీని చూసి సంతోషించింది. ''కుక్క తోక తెచ్చి గొట్టంబు చేర్చిన'' అంటుంటే నవ్వి ''నాన్నా! ఆ పద్యం మనుషులతత్త్వం చూసే, అర్థమయే అల్లాడు కవి'' వాడి తల మీద రాచి రెండో వేపు వరండాలోకి వెళ్లి కిందికి చూసి వచ్చింది'' శాంతా! గోపీ మంచి పద్యం వల్లిస్తున్నాడు. కుక్క పొద్దున్నే దాలి గుంటలోంచి లేచి యివతలికొచ్చి, వళ్లు విరుచుకుని '' ఇవాళెవరింట్లోనూ జొరబడద్దు. కఱ్ఱ దెబ్బలు తినద్దు. విసిరేరాళ్లకు కాలు విరుచుకోవద్దు. బుద్ధిగా వుంటాను. దొరికిందే తింటాను'' అనుకుంటుందిట. కాని కుక్క బుద్ధి గదూ'' అని శాంత బుజం మీద తట్టి ''దొండకాయ వేపుడా అదీ శాంతా? కింద ఒకామె కనిపించింది. తెలుసు గూడాను. మీ బంధువా? మీ భాగం కనుక్కోటమెట్లా అని వాకబ్ చేస్తున్నది. పైకి వచ్చేస్తుందేమో. గోపీ వల్లించే దానికీ ఆమె మనస్తత్త్వానికీ దగ్గర పోలిక వున్నది సుమా. నే పోతున్నా. నాకూ వంట వేళైంది. వచ్చే పెట్టె. పోయె పెట్టె అంటే తెలుసా? ''

''తెలుసు పిన్నీ. బొట్టు పెట్టించుకెళ్లు'' శాంత, అమృతపాణీ రెండు పళ్లు చేతుల్లో వుంచి బొట్టు పెట్టగానే లైట్లు వెలిగినై. ఇద్దరూ దణ్ణం పెట్టారు.

## 2

తాను రాగానే బాధ్యత తెలిసి వంట యింట్లో దూరి వంటపని అందుకున్నానా లేదా అని అల్లుడు నందకుమార్ శర్మ గమనించాడా లేదా అని అన్నివైపులా చూస్తూ వారి వద్ద కొచ్చి ముసుగు సవరించుకుంటూ, ముక్కు నలుపుతూ కుంపటి విసరటానికి గొంతుక్కూచున్నది. తన హిప్స్ యెంత బాగుంటాయి? గుండ్రంగా బలంగా కనబడతాయి. సన్నని సైను పంచలోంచి చూచాడా లేదా అని వార చూపులు చూసింది. పళ్లెంలో యిసకపోసి చిన్న కుంపటి వుంచి, గాస్ సిలిండర్ రావటం ఆలస్యమైతే దాని మీద ఆపూట పని కానిస్తుంది శాంత. నిలబడి కత్తితో కూర తరుగుతున్నది. పూర్ణమ్మ పప్పు కూర తిప్పుతున్నది. సువర్ణ వచ్చి, ''అమ్మా! మళ్లా నెప్పి వచ్చింది. అమ్మమ్మ వంట వేరు. నీ వంటల్లే లేదు. అల్లప్పచ్చడి చాలా కారం. నెయ్యి వెయ్యలేదు. నాకు బడి వేళైంది. బడి వాను వస్తుంది'' అన్నదేడుపు మొహంతో.

''పండు బెట్టు శాంతా. సువర్ణకి పండు బెట్టు. ఇవాళన్నం పెట్టకు. నా వంటే తప్పు పట్టావు సువర్ణా! రామనాథం, ఉమాకాంతం, సీతాకాంతం, పెద్ద పెద్ద వుద్యోగస్తులు అత్తవారి వేపు, యెవరు నీ వల్లె వంక పెట్టలేదు. మా నాయనగారు తహసీల్దారు, పింతండ్రి రెవెన్యూ ఇన్‌స్పెక్టరు, వీరందరికీ టైమ్‌కి వండి వార్చి వడ్డించింది నేనే. ఒక్కరు తప్పు పట్టలేదు. వుప్పూ కారం సరిగ్గా పడినైయని అంతా పొగడినవారే. వాళ్లిళ్లకి పిలుచుకెళ్లి వాళ్లవాళ్లకి వంటనేర్పమనే వారు. యెంత సంపాదించి పోస్తున్నా నోటికింత రుచిగా వండిపెట్టరుట. అదేం పచ్చడో చేసినవారు చెప్పేదాకా తెలియదుట. పప్పు వండటమే రాదుట. పప్పుకూరలు సరేసరి ముక్కలేవుడకవుట'' అంటున్నది.

''వాళ్లిళ్లకే వెళ్లక మా యింటి కెందుకొచ్చావూ?'' అని యేడుస్తూ తల్లి తెచ్చిన మందు తాగకుండానే బడికి వెళ్లింది సువర్ణ. మధ్యాహ్నం రానే లేదు. పొద్దూకి వచ్చి పుస్తకాల సంచీ మంచం మీద పడేసి ''అమ్మా! నాకు కడుపులో పోట్లు పెడుతున్నాయి. రాత్రికేమీ తినను. యేమీ అనుకోకు. నాన్న ట్యూషన్

పెట్టారు. నలుగురం అమ్మాయిలం ఒక మేష్టరు దగ్గర లెక్కలు నేరుస్తున్నాం'' అంటూ పుస్తకం అందుకుని వెళ్లిపోయింది.

రాత్రి యేడున్నర రైలులో, శాంత అత్తవారి వేపు మగపిల్లలిద్దరొచ్చారు. ఒకడు మరునాడు ఇంటర్వ్యూ వున్నదన్నాడు. రెండోవాడు మెడిసిన్‌లో సీటొచ్చిందనీ, హాస్టల్లో సీటిస్తారో లేదో కనుక్కోటానికి వచ్చాడట. ఫీజు కట్టాలేమో నందకుమార్ని అడగాలట.

మూతి విరుస్తూ, తల తాటిస్తూ, గొణుగుతూ గూడెగరేస్తూ, ముక్కు పీక్కుంటూ వంట చేసింది పూర్ణమ్మ. ''ఇంకా వస్తూనే వున్నారుటే నీ అత్త వారూ? విదిలించి కొట్టి, ఒయాసడించి వెళ్లినవారు గదూ?'' అని కొరకొరలాడింది.

మరునాడు మెయిల్లో మిట్ట మధ్యాన్నం మరో యిద్దరు దిగారు. ఒకడికి కళ్ల బాధ. శుక్లాలు తీయించాలన్నారుట. అడ్మిట్ కావాలేమో నర్సింగ్ హోమ్‌లో శర్మ చెప్పాలి. రెండో అబ్బాయికి టాన్సిల్సు తీయించాలిట. తరచూ జ్వరం వస్తుందిట. ఇయన్‌టీ సర్జన్ నందకుమార్ ఫ్రెండే.

మునమునలాడుతూ, ముక్కుతూ మూలుగుతూ, సాధిస్తూ దెప్పుతూ, పనివాళ్లమీద గమికీలు చేస్తూ, విసిరేస్తూ రోజులు నెట్టుతున్నది పూర్ణమ్మ. బాత్ రూమ్ తలుపు లోపల గడియ వేసుకోకుండా, స్నానం చేసింది.

''ఇదేమిటే శాంతా! నేను స్నానం కానిస్తుంటే తలుపు నెట్టి చూస్తున్నారు. బట్టకట్ట కోనివ్వరు. కూచునెలా దోవతీ కట్టుకుంటానూ? నీవేమైనావూ యెవర్నీ ఓ మాట అనవూ? చిన్న ముండనా చితక ముండనా? మందలించనన్నా మందలించవు. గుడ్లు పెట్టుకు చూస్తూ నిలబడతావు'' తిట్టటం ఆపినా పెదిమలు కదుల్తూనే వున్నాయి పూర్ణమ్మకు.

''స్నానం చేసేప్పుడు, స్నానాల గది లోపల గడియ పెట్టుకోవాలమ్మా. పోనీ నీ స్నానమై బైటికొచ్చేవరకు నేను తలుపు యివతల నిలబడి తరిమేస్తూ వుంటాలే. బైటికొచ్చేప్పుడు వంటి నిండా బట్ట కట్టుకురా'' అన్నది శాంత.

3

పొద్దున కాఫీ ఫలహారాలయాక శర్మ రఘు కోసం చూస్తే కనబడలేదు. ఇడ్లీ వుప్మా నేలమీద చిందర వందరగా పడివున్నాయి. గ్లాసు పక్కకు వాలి బల్లమీద కాఫీ ఒలికిపోయి వున్నది నందకుమార్ శర్మ, ''శాంతా! రఘు యేడీ? అప్పాయింట్‌మెంటున్నదే. ఐ స్పెషలిస్టు వద్దకు వెళ్లాలి. నేత్రాలయాలో చేర్పించాలని బెడ్ రిజర్వు చేయించాను. నువ్వేమన్నా నొవ్వ నాడావా వాడిని? వాడికసలే ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సున్నది. దానికీ వైద్యం చేయించాలి అని వాళ్ల నాన్న ఫోన్‌చేశాడు. వందెకరాలకి వారసుడు వాడు గౌరవంగా చూస్తే సరిపోలా''.

వంటింట్లో నించి పూర్ణమ్మ రై రై మని దూసుకు వచ్చింది. గుండు మీద ముసుగు జారితే సద్దింది. సగం బట్ట వూడుతుంటే దాన్ని కట్టింది సరీగ్గా.

'పూటపూటా అన్నిటికీ వంక పెడుతున్నాడా రాఘవాయి. వంటలక్క ననుకున్నాడేమో, తినటానికి పిండం లేక నీ యింట జేరాననుకుంటున్నాడు. నా కూతురు శాంతకి ప్రాణం మీదికి వచ్చింది. కింద బెట్టారని ఫోనొచ్చిందని పక్కింటబ్బాయి చెపితే, చూపులైనా అందుతాయో అందవో అని యేడుస్తూ పరుగు పరుగున రైలందుకు వచ్చాను కట్టుగుడ్డతో''. పూర్ణమ్మ చేసే ఒంటికాలి భరతనాట్యం చూడలేక ఆ భాష వినలేక నందకుమార్ రఘుకోసం పరుగెత్తాడు.

పూర్ణమ్మ శాంతమీద దాడి చేసి, గుడ్లురుమి, చేతులాడిస్తూ ''నువ్వెంత జేసు, నీ మొగుడెంత జేసు, యేం వుద్యోగం వెలిగిస్తున్నాడుటా? భీమా కంపెనీయేనా నిన్న కార్డు ముక్కగొలికి, పోస్టు డొక్కు యెక్కడున్నదో తెలియక, బల్లమీద పడేశా కార్డు ముక్కని'' శాంతా దాని మొగుడూ కూడి యేదో చేసి గర్బవిచ్చిత్తేమో రా వాసూ! ప్రాణం మీదికి తెచ్చుకుంటే పరుగెత్తుకొచ్చాను. శాంత బతికే వున్నది. లేచి తిరుగుతున్నది గూడాను. అత్తవారి వేపు వారొస్తే వండి వారుస్తూ బ్రహ్మరథం పడుతున్నది సిగ్గులేకుండా. నేనిక్కడుండటం అనవసరం. వచ్చేస్తున్నా. నేనేల వీరందరికీ పిండం పెట్టాలి?'' అని గొలికితే నువ్వూ నీ మొగుడు దాని వంక చూడనన్నా చూడలేదే ? నన్ను పంపేయ్. సాయంత్రం

యేడున్నర యెక్స్‌ప్రెస్‌లో పోతా'' అని వలవలా యేడుస్తూ లివింగ్‌రూమ్‌లో కెళ్లి అక్కడున్నవారి యెదుట యాగీ చేసింది పూర్ణమ్మ. వాళ్ల కర్థంగాక నిలువుగుడ్లు పడి లేచి లివింగ్‌రూమ్ వదిలి వెళ్లారు.

నందకుమార్ రఘుని వెతికి పట్టి నర్సింగ్ హోమ్‌లో అడ్మిట్ చేసి, ఆఫీసుకెళ్లి పనిపూర్తి చేసి వచ్చాడు.

సాయంకాలం రెండవ అబ్బాయిని యియన్‌టి సర్జనుకి చూపితే ''అదేం ప్రమాదకరమైంది గాదండి ఒక్కపూట నర్సింగ్ హోమ్‌లో వుంచి, తీసికెళ్లచ్చు. వర్రీ కాకండి. ఆకలి అంటే ఐస్‌క్రీమ్ నోట్లో వుంచితే అదే కరిగి దిగిపోతుంది''.

4

మరునాడు సాయంత్రం అయిదు దాటింది. బాగా చల్లబడింది ప్రహరీ లోపల కొన్ని నీడనిచ్చే చెట్లు కింద వాచ్‌మన్ శుభ్రం చేసి కుర్చీలు వేశాడు. వాటిల్లో కూచున్నారు. కొందరిపన్లు పూర్తి చేశాడు నందకుమార్. మిగిలిన వారు తమ ఘోష వెల్లడిస్తున్నారు. నందకుమార్ వింటున్నాడు.

తిప్పుకుంటూ వచ్చింది పూర్ణమ్మ ''నన్ను రైలెక్కించు నందయ్యా. నేను పోవాలి. రమ్మని ఫోన్ కాలొచ్చింది'' ముక్కు పీక్కుంటూ సింహావలోకనం చేసింది.

''చాలా మంది చేరారే నీచుట్టూ నందా? రమ్మని రాశావాయేం? వీరిలో నా కూతుర్ని ఆదుకున్నవారున్నారు? యేనాడు యెవరాదుకున్నారు? డబ్బు యిబ్బందులలోనా, జబ్బు పడిందనా, పచ్చం పానం చూడవచ్చారా? తేరగా దాని తల్లి వడ్డి స్తుందని యేవో పన్లు కల్పించుకుని ధీమాగా వచ్చేశారు నా కూతురుంటికి. ఏదో మిష. ఇంటి మీదబడి మేయాలనేదే అసలు కారణం'' అలా దండకం అందుకున్నది.

ఒక ధైర్యశాలి అబ్బాయి లేచి నవ్వుతూనే అంటించాడు.

''నీ ఐడియా గూడా అదే అమ్మమ్మా. నొల్లుకు పోవటానికీ, దండుకుపోవటానికీ యేదో మిషపెట్టి వచ్చి సంగ్రహిస్తావు. నీ జిహ్వా చాపల్యం

తీర్చుకుంటూ యేమీ తినకుండా ఒక్క పూట తింటున్నట్టు భ్రమ కల్పిస్తూ రాత్రిళ్లు వాయుభక్షణ చేస్తూ గొడ్డు చాకిరీ చేస్తున్నట్టు యింద్రజాలం చూపుతావు. నందకుమార్ మామయ్య సమర్దుడని వస్తామంతే'' అని కూచున్నాడు.

రేగిపోయింది పూర్ణమ్మ. బయట ప్రదేశంలో కారాగింది. దాని నుంచి ఒక యాభై యేళ్ల పెద్ద మనిషి దిగి నడిచి వీరందరినీ చూసి తాను ఖాళీ కుర్చీ ఆక్రమించాడు.

''నన్ను పంపేయ్ నందయ్యా! వాడలా అంటుంటే చూస్తావేం? నీ నోరు పడిపోయిందా'' అంటూ లిఫ్టు వేపు పరుగెత్తి నందకుమార్ వున్న భాగంలో కెళ్లి గబగబ వచ్చి లిఫ్టులో దూరి వచ్చేసింది పెద్ద మూటతో. తిన్నగా వెళ్లి కారు తలుపు తీయమని, తన మూటతో వెనక సీట్లో కూచున్నది పూర్ణమ్మ.

నందకుమార్ లేచి వెళ్లి, డ్రైవరుకు నోట్లు అందించి ''బెజవాడకు రైల్ టికెట్ కొని, రైలులో కూచో బెట్టిరా. కాఫీ తాగిరా'' అన్నాడు.

''యస్సార్!'' అని సెల్యూట్ కొట్టి డ్రైవరు చక్రం బట్టాడు. కారు గిర్రున తిరిగి మెయిన్ రోడ్ వేపు వెళ్లింది.

## 5

సామర్లకోట స్టేషన్లోనూ, నిడదవోలు స్టేషన్లోనూ యిద్దరాడంగులు తన పెట్టెలోకి యెక్కటం చూసిన పూర్ణమ్మ సంతోషించింది. కళ్లు మిలమిల లాడినై. రైలు పెట్టెలో లైట్లూ ఫాన్లూ ఆనంద మిచ్చినై.

''యెక్కడినించే పూర్ణక్క? శాంతను చూసి వస్తు న్నావా? గలాటా, గలాభా చేసి సందడి చేశావా?'' అనడిగింది పూర్ణమ్మ చెల్లెలు సర్వలక్ష్మి.

''నీ హాస్యానికేం లే లచ్చాం. కూతురు శాంతికి కడుపు దింపించాడు నందయ్య. ప్రాణం మీదికొచ్చిందంటే వెళ్లానా? ఇంటి నిండా మగవెధవలు, నందయ్య వేపు వాళ్లు చేరి యెకచకాలు పకపకలూ. యేవో పన్లున్నాయిట వైజాగులో. వంచిన నడుం యెత్తకుండా చేయాల్సి వచ్చింది లచ్చాం. సాయమే లేదు. చేయలేక వచ్చేశా కాని, చిక్కి శల్యమై, ప్రాణావశిష్టమైన శాంతను వదిలి వచ్చానే, రక్తమంతా కోల్పోయి పాలిపోయిన కూతుర్ని వదిలి తొందరపడి

బయలుదేరానే అని మనసంతా అక్కడే వున్నది. మరిది సుబ్బడు యెలా వున్నాడూ? పక్షవాతం వచ్చిందన్నారే మనవాళ్లు. తీరిక లేక రాలేకపోయినా'' అన్నది పూర్ణమ్మ. విచారంగా చూసింది.

అనసూయమ్మ పూర్ణమ్మ పెద్దక్క కూతురు, ''యెన్నాళ్లన్నావే పూర్ణ పిన్నీ! తిరిగే కాలూ తిట్టే నోరూ బయలు దేరదీసి వుండాలి. సుబ్బడు బాబాయికి పక్షవాతం వచ్చి రెండేళ్లయిందిగా. లచ్చాం పిన్నికి కావాల్సినంత స్వేచ్ఛ పూర్ణ పిన్నీ. నోరు గూడా పడిపోయింది బాబాయికి. నీ వింకా వినలేదేమో అందర్నీ కవ్వించి యేడిపించి, దుమ్మెత్తి పోసే మరీ బయలు దేరి వుండాలే అని నోటి మీద చెయ్యి వుంచుకుని నవ్వింది'' అనసూయమ్మ.

''నువ్వూ తక్కువ తినలేదే అనసూ. మాట పడగలవా? అసలు అల్లుడూ కూతురూ మధ్య కలగజేసుకుని నోరెత్తనీయకుండా జాడించి వదిలి రాగలవే?'' అనే సరసం రైలు చక్రాల చప్పుడులో కలిసిపోయింది.

అనుసూయమ్మ సీటు ఖాళీకాగానే కొంగు పరుచుకుని మేను వాల్చింది.

6

''శాంతా. ఇవాళ నేను కేదార వ్రతం చేసుకున్నా. ప్రసాదం పారేయరాదు. నీకూ పిల్లలకీ నందకుమార్ శర్మకీ తెచ్చా'' అన్నది సంఘసేవిక. వాకిలి కివతలే నిలబడింది.

''లోపలికి రా పిన్నీ. ఆపేక్షగా వచ్చి చూచిపోతావు'' అని శాంత ఆమెను లోపలికి తీసికెళ్లింది.

డైనింగ్ టేబిల్ మీద పొట్లాలు విప్పి పళ్లేలలో వుంచుతున్న పిన్ని గోపీ పద్యం విన్నది.

''కుక్క తోక తెచ్చి గొట్టంబు దూర్చిన తిన్న నగును దాననున్న వరకె''.

''నాన్నా! గోపీ, యెంత మంచి పద్యం రా నేర్చిందీ. ప్రసాదం తినాలి. లేవరా'' అని వచ్చి గోపీ చేయి పట్టుకుని లేవదీసి, బల్లముందు కుర్చీలో కూచోబెట్టి ప్రసాదం పళ్లెం ముందుంచింది సంఘసేవిక పిన్ని.